## క్లుప్తంగా

### దాతల సహకారం అభినందనీయం

**పోడూరు:** ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు దాతలు సహకారం అందించడం ఎంతో అభినందనీయమని ఎస్ఎస్ఏ అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్ అన్నారు. పోడూరులోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు ఉన్నవిద్యార్థులకు స్థానిక దాతలు నెక్కంటి అచ్యుతరామయ్య, కోలా విజయ్‌లు అందించిన ఆర్థిక ప్రోత్సాహంతో వ్యాయామ పరికరాలు, ఆటవస్తువులు సమకూర్చారు. అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్యామ్‌సుందర్ చేతులమీదుగా వాటిని విద్యార్థులకు అందజేశారు. ఎంఈఓ-1 జి.విజయ్‌కుమార్, ఎంఈఓ-2, జి.సూర్యనారాయణ, ఐఈఆర్‌టీ కోఆర్డినేటర్ సీహెచ్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

### నారుమడుల పరిశీలన

**మొగల్తూరు:** సార్వాసాగుకు సంబంధించి ఇప్పటి వరకు నారుమడులు వేయని రైతులు వెదజల్లే పద్ధతిని పాటించాలని సహాయ వ్యవసాయ సంచాలకురాలు ఇ.అనిలకుమారి సూచించారు. గురువారం రామన్నపాలెంలోని అడవిపర్రు, సుబ్బరాయుడు గుడి తదితర ప్రాంతాలలో నారుమడులు వేసిన పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఇప్పటి వరకు మండలంలో సుమారు 70 ఎకరాల్లో మాత్రమే నారుమడులు వేశారన్నారు. ఇప్పటికే నారుమడులు వేయని రైతులు వెదజల్లే పద్ధతి పాటించాలని, ఇలా చేస్తే ఎకరానికి 12 నుండి 15 కేజీల విత్తనాలు సరిపోతాయని వివరించారు. సాగులో సమస్యల పరిష్కారానికి రైతు సేవా కేంద్రంలో ఉన్న సిబ్బంది సేవలను వినియోగించుకోవాలన్నారు.

# తల్లికి వందనంలో నిబంధనల మెలిక

- తల్లికి వందనం ఒక్కరికే అంటూ ఇచ్చిన జీఓపై మహిళల మండిపాటు
- అధికారంలోకి వచ్చాక మాట తప్పడంపై ఆగ్రహం

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మహిళలకి తొలి షాక్ తగిలింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేల చొప్పున తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. కుటుంబానికి ఒక్కరికే తల్లికి వందనం అమలు చేస్తామని జీఓ విడుదల చేయడంపై మహిళలు మండిపడుతున్నారు. ముఖ్యంగా మంత్రి నిమ్మల రామానాయుడు ఎన్నికల ప్రచారంలో భాగంగా చెప్పిన మాటలను యువత సోషల్ మీడియాలో షేర్ చేస్తూ కూటమి ప్రభుత్వ తీరును ప్రశ్నిస్తున్నారు. అలాగే తల్లికి వందనం ఎప్పటి నుంచి అమలు చేస్తారని ప్రశ్నిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



తరగతి గదిలో చదువుకుంటున్న విద్యార్థినులు (ఫైల్)

### ఆర్థిక ఇబ్బందులు తప్పవు



మాకు ఇద్దరు అబ్బాయిలు. ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. ఎన్నికల్లో తల్లికి వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది పిల్లలకు రూ. 15 వేలు ఇస్తానని నాయకులు చెప్పడంతో ఆనందంగా అనిపించింది. కానీ ఇప్పుడు ఇంటికి ఒక్కరికే ఇస్తామని అంటున్నారు. ఇదే నిజమైతే ఇద్దరు పిల్లలున్న వారికి ఇబ్బందులు తప్పవు.

– వేండ్ర నాగదుర్గ, గృహిణి, పాలకొల్లు

### ప్రతి బిడ్డకూ ఇస్తామన్నారు



నాడు ఎన్నికల ప్రచారంలో ప్రతి బిడ్డకూ తల్లికి వందనం కింద రూ.15 వేలు ఇస్తామన్నారు. కానీ ఇప్పుడు ఒకరికి మాత్రమేనంటున్నారు. ప్రభుత్వం మహిళలను మోసం చేయకుండా పిల్లలను చదివించుకునేందుకు ప్రతి బిడ్డకూ తల్లికి వందనం ఇవ్వాలి. కొత్తగా ఆదాయ పరిమితి తగ్గింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

– ఎన్.సుమ, లంకోపేట

### పేదవారికి ఇబ్బందే



ఒక్క బిడ్డకే తల్లికి వందనం అంటే పేదవారు తమ బిడ్డలను చదివించుకోలేరు. ప్రతి బిడ్డకూ ఇస్తామని పదే పదే చెప్పారు. దీంతో పేదవారు అందరూ అందరి పిల్లలను చదివించుకోవచ్చని అనుకున్నారు. మళ్లీ పిల్లలను పనులకు పంపుకోవాల్సి వస్తుందేమో? మాట తప్పకుండా ప్రతీ బిడ్డకూ రూ.15వేలు ఇచ్చి అండగా నిలవాలి.

ఎం.మేరీ, చిల్లేవారి పాలెం

### మాట తప్పకూడదు



తల్లికి వందనం పథకం విషయంలో ప్రభుత్వం మాట తప్పకూడదు. ఇంట్లో ఒక్కరికే రూ 15వేలు ఇస్తారనే ప్రచారం జరుగుతుంది. ఇది నిజమో? కాదో? తెలియదు. ఎన్నికల్లో ఇంట్లో ఎంతమంది పిల్లలు బడికి వెళితే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం మాట తప్పకుండా అందరి పిల్లలకు తల్లికి వందనం పథకం వర్తింపజేయాలి.

– కావలి నాగరాజు, రాయిపేట, నరసాపురం

### పిల్లలందరికీ పథకాన్ని వర్తింపజేయాలి



ప్రభుత్వ పాఠశాలల్లో ఫీజులు ఉండవు. కానీ ఉచితంగా ఇచ్చే విద్యా సామగ్రి ఏడాది పొడవునా సరిపోవు. ప్రస్తుత రోజుల్లో విద్యా సామగ్రి, నోట్‌బుక్స్ ఖర్చులు బాగా పెరిగిపోయాయి. కాబట్టి ఒక కుటుంబంలో ఎంత మంది పాఠశాలకు వెళ్తే అంత మందికి తల్లికి వందనం పథకం వర్తింపజేస్తే పేద పిల్లల చదువు ముందుకు సాగుతుంది.

– బి.చంద్రకుమారి, జిన్నూరు, పోడూరు మండలం

### ఆశగా ఎదురుచూస్తున్నాం



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తల్లికి వందనం కింద పిల్లలందరికీ ఏడాదికి రూ.15 వేలు వస్తుందని మాలాంటి తల్లులంతా ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నాం. అయితే ఇంట్లో ఒక్కరికే ఈ పథకం వస్తుందని ప్రచారం జరుగుతుంది. అలా కాకుండా ఎన్నికలకు ముందు హామీ ఇచ్చినట్లుగా అందరికీ రూ.15 వేలు చొప్పున ఇవ్వాలి.

– కొర్రపాటి ప్రశాంతి, పెనుమదం, పోడూరు మండలం

### ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం

**మొగల్తూరు:** బిడ్డకు బిడ్డకు మధ్య అంతరం ఉండాలంటే కుటుంబ ప్రణాళిక అనేది అవసరమని డాక్టర్ కె.లక్ష్మీ పార్వతి సూచించారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం మొగల్తూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జనాభా పెరుగుదల వల్ల కలిగే ఇబ్బందులపై అవగాహన కల్పించారు. సీడీపీఓ బి.ఊర్మిల, ఎంపీహెచ్‌వో ఏఎస్ఎస్ఎన్ మూర్తి, ఎస్ సత్యవతి పాల్గొన్నారు.

**పాలకొల్లులో..**

**పాలకొల్లు సెంట్రల్:** స్థానిక జీఎస్‌వీఆర్ఎం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. త్రిమూర్తులు, చంద్రకళ, శశికళ పాల్గొన్నారు.

**లంకలకోడేరులో..**

**పాలకొల్లు అర్బన్:** తల్లి బిడ్డ సంరక్షణ కోసం బిడ్డ బిడ్డకు మధ్య ఎడమ అవసరమని మెడికల్ ఆఫీసర్ డా.అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవంలో భాగంగా గురువారం లంకలకోడేరు రాజీవ్‌నగర్, లంకలకోడేరు గ్రామంలో నిర్వహించిన ర్యాలీని గ్రామ సర్పంచ్ చొప్పల రజని ప్రారంభించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, పీహెచ్ఎన్ పి.ఎలిజబెత్ పాల్గొన్నారు.

**ప్రకటన**

నా క్లయింటు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, నరసాపురం బ్రాంచి వారు నాకిచ్చిన సెంకాయిస్ ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని శ్రీ మల్లిపూడి నరసింహారావు తండ్రి వాసుదేవరావు మార్టిగేజ్ చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తి పై ఏ విధమైన అభ్యంతరములు ఉన్నారు ప్రకటన వెలువడిన వారం రోజులలో తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరములు స్వీకరించబడవు. నరసాపురం సబ్ రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం.1208/2013. ఆర్.యస్.నెం .58/1 లో 72 చ.గ. నరసాపురం పట్టణం 6వ వార్డుకు స్థలానికి హద్దులు తూర్పు: అంబ్రాహ్మాంపు రోడ్డు, పడమర: ఎ.సత్యనారాయణ భవనం, ఉత్తరం: పొలంకి లక్ష్మీపతి గారి భవనం తదితరులు, దక్షిణం: దారి

పి.డి.యస్.వి.బాలాజీ, బి.కాం.బి.ఎల్.
అడ్వకేటు.పాలకొల్లు.సెల్ : 9490433732

### మొక్కల పంపిణీ

**పెనుమంట్ర:** మండలంలోని పాలమూరులో విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు అత్తిలి శాఖ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు పంపిణీ చేశారు. తహసీల్దార్ కోట లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ పి.పద్మజ, సర్పంచ్ కాకర రాజేశ్వరరావు పాల్గొన్నారు.